క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి

కొండమల్లేపల్లి : తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల జేఏసీ సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ఈ విషయాన్నితీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల జేఏసీ అధ్యక్షుడు కోట్ల సతీష్, పొట్ట లక్ష్మణ్ తదితరులున్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన జాతి దూడలు

పెద్దవూర : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రతి గ్రామంలో ఆర్టిఫిషియల్ ఇన్సెర్మేషన్ ద్వారా గేదెలకు కృత్రిమ గర్భధారణతో మేలైన జాతి దూడలు పుట్టిస్తున్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ నడ్డి బాలరాజ్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని సంగారం గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కృత్రిమ గర్భధారణతో పుట్టిన దూడలను ప్రదర్శించి మాట్లాడారు. ఎస్ఏఐపీ కార్యక్రమం ద్వారా రైతులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇన్సెర్మేషన్ ద్వారా నాలుగు విడతల్లో నాణ్యమైన మేలు జాతి దూడలను పుట్టించినట్లు తెలిపారు. పాడిరైతులు గోపాలమిత్రల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నడ్డి లింగయ్య, ఉప సర్పంచ్ మట్టపల్లి ప్రదీప్‌రెడ్డి, వార్డు సభ్యులు సాయిరెడ్డి, వెంకన్న, నరేందర్, గోపాలమిత్ర గాలి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

హాలియా : పట్టణంలోని ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన సీహెచ్ గోవర్థన్‌రెడ్డి, నిడమనూరు మండలంలోని నర్సింహులుగూడెం గ్రామానికి చెందిన నారాయణకు మంజూరైన రూ.74 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కోటిరెడ్డి శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, జిల్లా ముస్లిం, మైనార్టీ నాయకులు ఆంజాద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి షేక్ జానీ, కొట్టాల శ్రీను తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

డిండి : మండల పరిధిలోని దాసరినెమలిపూర్ తండాకు చెందిన వడ్త్య పాండునాయక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా శనివారం వీడీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, దేవరకొండ మాజీ మున్సిపల్ చెర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. పాండు మృతిపై సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ నరసింహరావు, యకో ఆప్షన్ మెంబర్ జహంగీర్, వెంకట్‌రెడ్డి, బిక్కునాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దవూర : మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన మల్లికార్జున ఫంక్షన్ హాల్ యజమాని మల్‌రెడ్డి నారాయణరెడ్డి పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం మండంలోని పెద్దగూడెం గ్రామంలో నిర్వహించిన నారాయణరెడ్డి దశదినకర్మకు ఎమ్మెల్యే నోముల భగత్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు గజ్జెల లింగారెడ్డి, బెడుదూరి వెంకట్‌రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు రిక్కల ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత

చింతపల్లి : మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామానికి చెందిన ఆరెకంటి తేజ సెల్ ఫోన్ ఈనెల 4న గ్రామంలో పోగొట్టుకున్నాడు. ఈ విషయమై చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొబైల్ ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా ఫోన్‌ను పోలీసులు గుర్తించారు. ఈ మేరకు శనివారం తేజకు ఫోన్‌ను అప్పగించారు.

మున్సిపాలిటీ ఎదుట పందుల పెంపకందారుల ధర్నా

దేవరకొండ : ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పందులను దేవరకొండ మున్సిపల్ అధికారులు పటుకొని తరలించడంపై పెంపకందారులు శనివారం ఉదయం దేవరకొండ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పందులను పట్టుకోవడం తగదన్నారు. పందుల పెంపకందారులకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ వెంకటయ్యలు వారికి నెల రోజుల్లో స్థలాన్ని కేటాయిస్తామని హామీ నివ్వడంతో ఆందోళన విరమించారు.ధర్నాలో లింగయ్య, రమేష్, చంద్రయ్య, నాగరాజు, తిరుపతయ్య, కొండల్, రమేశ్ పాల్గొన్నారు.

పశు వైద్యం.. దైన్యం

- వైద్యులు, సిబ్బంది కొరతతో మూతబడ్డ పశువైద్యశాలలు
- మండలానికి పశువైద్యాధికారే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు

గుర్రంపోడు : మండలంలో పశువుల ఆస్పత్రుల్లో వైద్యుల కొరతతో మూతబడుతున్నాయి. మండల కేంద్రంతోపాటు పిట్టలగూడెం, చేపూరు, కొప్పోలు, జూనూతుల గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. మండలకేంద్రంలో పశు వైద్యాధికారితోపాటు ఎల్ఎస్ఏ(లైవ్‌స్టాక్ అసిస్టెంట్) ఉన్నారు. ఇక్కడ వెటర్నరీ అసిస్టెంట్ అవసరం ఉంది. కొప్పోలులో ఎల్ఎస్ఏ ఉన్నా అనారోగ్యం కారణంగా సేవలు అందించలేకపోతున్నాడు. ఇక్కడ అటెండర్ పోస్టు ఖాళీ ఉంది. మిగతా మూడు పశువైద్యశాలలు మూతబడ్డాయి. పశువైద్యశాలల్లో ఒక వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ లు ఉండాల్సి ఉండగా సిబ్బంది కొరతతో పోస్టులన్ని ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలోనూ మండలంలో పశువైద్యశాలలు మూతబడిన విషయమై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో పాల్వాయి గ్రామంలో గతంలో పశువైద్యశాల మంజూరైనా సిబ్బంది కొరతతో వైద్యశాలను ఏర్పాటు చేయడం లేదు.

పాడిరైతులకు తప్పని ఇబ్బందులు

మండలంలోని పలు గ్రామాల నుంచి పశువైద్య సేవలకు మండలకేంద్రంలోని పశువైద్యశాలపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారిగా గొర్రెల పంపిణీ, ఇతర శాఖ పరమైన సమావేశాలు, ఇతర పనులు వైద్యాధికారి ఒక్కరే నిర్వహించాల్సి వస్తుంది. మండలంలో జూనూతుల గ్రామ పశువైద్యశాలలో పశువైద్యాధికారి పోస్టు ఉన్నా అక్కడ డాక్టర్ బదిలీకాగా మళ్లీ డాక్టర్‌ను నియమించలేదు. అప్పటి నుంచి ఐదేళ్లుగా ఆస్పత్రి మూతబడే ఉంది. పిట్టలగూడెం పదేళ్లుగా పశువుల ఆసుపత్రి మూతబడి భవనం శిథిలమవుతుంది. ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధి కావడం, 37 గ్రామపంచాయతీలతో మండలం జిల్లాలోనే రెండో పెద్ద మండలంగా ఉన్నందున ఇక్కడ పశువైద్యసేవలు మండలకేంద్రంలోనే అందుబాటులో ఉండటంతో రైతులు నాటు వైద్యుల మీద, మెడికల్ షాపుల వారు ఇచ్చే మందుల మీదనే ఆధారపడాల్సి వస్తుంది.



చేపూరులో వైద్యుడు లేక మూతబడ్డ పశువైద్యశాల

నాటు వైద్యమే దిక్కు



మా గ్రామంలో పశువుల ఆస్పత్రి మూతబడటంతో పశువైద్యసేవలు అందడం లేదు. అనారోగ్యం బారిన పడిన మూగజీవాలను మండలకేంద్రం తీసుకుని వెళ్లి వైద్యం చేయించడం కష్టంగా ఉంది. మాకు తెలిసిన నాటు వైద్యం చేస్తున్నాం. పశువుల డాక్టర్‌ను నియమించి ఆసుపత్రి తెరిపించాలి.

–బొంగరాల ముత్యం, రైతు పిట్టలగూడెం

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో పశువైద్యశాలలు మూతబడిన విషయాన్ని ఉన్నాతాధికారులకు నివేదించాం. పశువైద్యులను డిప్యుటేషన్లపై ఇతర ప్రాంతాల నుంచి పంపించాలని కోరాం. అత్యవసర పరిస్థితుల్లో గోపాలమిత్ర సేవలు వినియోగించుకుంటున్నాం.

– అశోక్‌కుమార్, మండల పశువైద్యాధికారి

పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

అడవిదేవులపల్లి : పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కొత్త మర్రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సుపరిపాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, మాజీ ఎంపీపీ కురాకుల మంగమ్మ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కురాకుల చిన రామయ్య, ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను, మండల కో ఆప్షన్ సభ్యులు బాబ్జని, నాయకులు గురువయ్య, ముత్యాలు, సూర్యానాయక్‌లతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

మున్సిపాలిటీలతో ప్రజలకు పాలనా సౌలభ్యం



హాలియా : కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీలతో ప్రజలకు పరిపాలనా సౌలభ్యం ఎంతో జరిగిందని ఎమ్మెల్యే నోముల భగత్ తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నోముల భగత్ హాజరై మాట్లాడారు. హాలియా మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీ పరిధిలో రూ.50 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు, సిబ్బందిని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కమిషనర్ కందిమల్ల వీరారెడ్డి, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, కోఆప్షన్ సభ్యులు చాపల సైదులు, సమీనా అన్వరుద్దీన్, రావుల లింగయ్య, డోమినిక్, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ప్రధాన కార్యదర్శి దోరేపల్లి వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు సైదాచారి పాల్గొన్నారు.

సమన్వయంతో సం పూర్ణ అభివృద్ధి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే సీఎం కేసీఆర్ కలలుగన్న బంగారు తెలంగాణ సాకారమయ్యిందని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, తహసీల్దార్ పాండునాయక్, ఏఓ జానకిరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, దేవస్థాన చైర్మన్ నాగేండ్ల వెంకట్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జంగాల లక్ష్మమ్మ, సర్పంచ్‌లు దేవుడునాయక్, నగేష్, హనుము, రవి, పురుషోత్తం, బిచ్యానాయక్, చందులాల్, మార్కెట్ డైరెక్టర్ హరికృష్ణ, నాయకులు చందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందినట్లు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటి అభివృద్ధి కోసం కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అనేక అవార్డులు అందించారన్నారు. గ్రామాల్లో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను అభివృద్ధి పరిచి చేప పిల్లలను అందించి మత్స్యకార్మికులకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళహనుమంతరెడ్డి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, నాయకులు పులి జగదీష్, ధర్మపాల్‌రెడ్డి, గజ్జల జయమ్మ కోటిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నగేశ్ తదితరలు పాల్గొన్నారు.



సుపరిపాలన దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

కరాటేతో ఆత్మరక్షణ

దేవరకొండ : కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి జపాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 12న పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2కే రన్‌లో పెద్ద ఎత్తున యువత పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీతో కలిసి కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాపోలు సుదర్శన్, ఉమామహేశ్వర్, తాళ్ల సురేష్, భాస్కర్‌రెడ్డి, వాసు, రమేష్, పీజే శ్యాంసన్, శ్రీను, వెంకన్న, సైదులు ఉన్నారు.

సుపరిపాలన పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమళ్ల వెంకటేశ్ అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మండల కేంద్రంలో బీఎస్పీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన సీఎం కేసీఆర్ సుపరిపాలన సంబోగాలు ఎవరి కోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటేశ్వర్లు, రేపాక నర్సింహా, ముత్యాలు, రమేష్, సుధాకర్, లక్ష్మణ్, నరేందర్, నర్సింహా, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పరిపాలన దార్శనికుడు సీఎం కేసీఆర్

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిపిన దార్శనికుడు సీఎం కేసీఆర్ అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్ పథకాలు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తదితర సంక్షేమ పథకాలతో ఆదర్శవంతమైన పాలన రాష్ట్రంలో సాగుతుందన్నారు. నూతన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు మండలాల ఏర్పాటుతో పాలన సౌలభ్యం మెరుగుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, యుగేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



ఎమ్మార్సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి

మాడుగులపల్లి : మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నల్లగొండ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మాడుగులపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనాన్ని మండల ప్రత్యేకాధికారి, డీఈఓ భిక్షపతితో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. పరిపాలనా సౌలభ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసిందన్నారు. మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలో పక్కా భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మార్సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయ కార్యకలాపాల కోసం తాత్కాలికంగా రెండు గదులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు పంచాయతీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, సర్పంచ్ తూనం శోభరవి, ఉప సర్పంచ్ సైదిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు మౌలాలి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబయ్య, నాయకులు మునుగోటి యాదయ్య, పుట్ట మధు, జక్కలి సైదులు, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివశంకర్, ఎంఈఓ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట సుబ్బారావు సేవలు ఆదర్శనీయం

హాలియా : జాతీయ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు సేవలు ఆదర్శనీయని పీఆర్‌టీయూ సంఘం జిల్లా నాయకులు, ఉపాధ్యాయుడు మందా సైదులురావు గౌతమ్ అన్నారు. భారతదేశ ప్రతిజ్ఞ రచయిత, బహుభాషా శాస్త్రవేత్త పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలను శనివారం అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మందా సైదులురావు గౌతమ్ వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించి మాట్లాడారు. జాతీయ ప్రతిజ్ఞను పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించి దేశ సమైక్యతకు, సమగ్రతకు ఎంతగానో కృషి చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి యడవెల్లి సోమశేఖర్, పంచాయతీ వార్డు సభ్యుడు యడవెల్లి సైదులు, మహిళా నాయకురాలు యడవెల్లి సునిత, మందా వెంకటమ్మ, సోమమ్మ, మెగావత్ సోని, ధారావత్ చరణ్, సాత్విక్ ఉన్నారు.



వెంకట సుబ్బారావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

లోక్ అదాలత్ తీర్పే అంతిమ తీర్పు

మిర్యాలగూడ టౌన్ : లోక్ అదాలత్ తీర్పే అంతిమ తీర్పు అని ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె. కవిత, సీనియర్ సివిల్ జడ్జి డి. సుజయ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. స్వర్ణలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల అన్నారు. శనివారం స్థానిక కోర్టు అవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గంగా లోక్ అదాలత్ ఒక వేదికగా తయారయిందన్నారు. ఆయా కోర్టుల ద్వారా ఈ వారం రోజుల్లో మొత్తం 2635 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీనివాస్, జాతీయ లోక్ అదాలత్ సభ్యులు మేక కుమార్‌రెడ్డి, కొంక వెంకన్న, ఎం. మల్లేష్, దూపాటి మట్టయ్య, బాణోతు జ్యోతి, దనావత్ రాజశేఖర్, శ్రీను, ప్రభాకర్, ఎపీపీఓ కృష్ణప్రసన్న, జి. సుధాకర్, దీపరాణి, ప్రభుత్వ న్యాయవాది లింగంపల్లి శ్రీనివాస్, ఎస్‌బిఐ బ్యాంకు ఏజీఎం అలీముద్దీన్, రీజినల్ మేనేజర్ రాంబాబు, పీపీ లింగంపల్లి శ్రీనివాస్‌లతో పాటు సీనియర్. జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి కె. కవిత

లోక్ అదాలత్‌లో 152 కేసుల పరిష్కారం

నిడమనూరు : నిడమనూరు కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 152 కేసులను పరిష్కరించారు. 260 డ్రంక్ అండ్ కేసుల్లో , 812పిట్టి కేసుల్లో జడ్జి స్వప్న జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో సాగర్ సీఐ బీసప్ప, హాలియా సీఐ గాంధీనాయక్, బార్ అసోసియేషన్ కార్యదర్శి చిన వీరయ్య, న్యాయవాదులు నాగరాజు, వినోద్, వెంకన్న, నాయక్, సత్యనారాయణ, కక్షి దారులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గుండా శ్రీనివాస్ పెరికను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి శ్రీనివాస్ పెరికకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పెరిక మాటాడారు. తన నియామకానికి సహకరించిన ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న గౌడ్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందజేస్తున్న జానారెడ్డి

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వేములపల్లి : మండలంలోని అన్నపరెడ్డిగూడెం గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని వేద పండితులు పుల్లభట్ల శివరామశర్మ, సాగి నరసింహమూర్తిల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చరణల నడుమ ధ్వజస్తంభాన్ని, దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. అన్నపురెడ్డిగూడెం గ్రామంతోపాటు ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్, ఎంపీపీ పుట్టల సునీత, సర్పంచ్‌లు బత్తుల ధనమ్మ, నామిరెడి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, మజ్జిగపు పద్మ, నాయకులు ఇరుగు వెంకటయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

గిరిజన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

హాలియా : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తన తనయుడు కుందూరు జైవీర్‌రెడ్డి ఈనెల 14 నుంచి చేపట్టనున్న గిరిజన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పాత ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గిరిజన చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుడిలా పని చేసి వచ్చే ఎన్నికల్లో సాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువనాయకులు, తన తనయుడు కుందూరు జైవీర్‌రెడ్డి చేపట్టే గిరిజన చైతన్య యాత్ర ఈనెల 14న పెద్దవూర మండలంలో ప్రారంభమమై తిరుమలగిరి(సాగర్) మీదుగా నిడమనూరు, త్రిపురారం మండలాల వరకు కొనసాగుతుందన్నారు. ఈ చైతన్య యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, రాష్ట్ర యువనాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నిడమనూరు జెడ్పీటీసీ రామేశ్వరీ, త్రిపురారం మండల ఎంపీపీ అనుముల పాండమ్మశ్రీనివాస్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు ఉన్నారు.



హాలియాలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ : కోదాడ– జడ్చర్ల రహదారిపై స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ రహదారి నుంచి ఇండస్ట్రీయల్, జంకుతండాకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయగా రహదారిని దాటే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు దాటే ప్రదేశంలో కనీసం స్పీడు బ్రేకర్లు కాని, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో ఇప్పటికే ఈ రహదారిపై ముగ్గురు మృతిచెందగా అనేక మంది గాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

నందికొండలో రూ.30కోట్లతో అభివృద్ధి పనులు

నాగార్జునసాగర్: నందికొండలో మున్సిపాలిటీలో రూ.30కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు మున్సిపల్‌చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని నందికొండ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారుఉ మాట్లాడుతూ రూ.9కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. కోటీలతో వైకుంఠధామం, పైలాన్ కాలనీలో రూ.8కోట్లతో 60ఫీట్ల రహదారి, డిజిటల్ లైబ్రరీ, బస్టాండ్ ఆధునీకరణ, మోడరన్ దోబీగాట్ వంటి పనులు ఈ మూడేళ్లలో పూర్తయినట్లు తెలిపారు. రూ.44కోట్లతో అమృత్–2ద్వారా ఇంటింటికి 24గంటలు నీటి సరఫరా కాన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ అనూషారెడ్డి, వైస్‌చైర్మన్ బిన్నిలకు కమిషనర్ రవీందర్‌రెడ్డి శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. వీరితో పాటు రమేశ్‌జీ, రామకృష్ణ కౌన్సిలర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శరత్‌రెడ్డి, మోహన్‌నాయక్, విక్రం తదితరులు పాల్గొన్నారు.



నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్, కౌనిలర్లను సన్మానిస్తున్న కమిషనర్

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ : వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుద్దేటి సైదులు అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అయన మాట్లాడారు. వికలాంగులకు పెన్షన్ రూ.6 వేలు ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాచారి, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, అంజనేయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి సర్పంచ్ రాజీనామా

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని బచ్చాపురం గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీదేవి శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో తీవ్ర మనస్తాపంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి తోడ్పడుతుంటే పక్క గ్రామ నాయకులు వచ్చి తన గ్రామంలో పెత్తనం చెలాయిస్తూ తనను అవమాన పర్చినట్లు తెలిపారు. దీంతో తన భర్త జవహర్‌తో కలిసి తాను కూడా పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.